మహనీయుడు అంబేడ్కర్


ధర్మవరంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీసెల్ నాయకులు


నల్లచెరువులో అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి నివాళులర్పిస్తున్న కన్వీనర్ రవికుమార్‌రెడ్డి


గాండ్లపెంటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

- ఊరూరా రాజ్యాంగ నిర్మాత జయంతి
- అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని వక్తల పిలుపు

సాక్షి బృందం: సామాజిక అసమానతలను రూపుమాపిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వక్తలు కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు సోమవారం ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల కార్యాలయాలతో పాటు ఊరూరా జయంతి వేడుకలు అంబరమంటాయి. వైఎస్సార్‌సీపీ తదితర రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ తదితర ప్రజాసంఘాల నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు.


బత్తలపల్లి ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం ముందు కేక్ కట్ చేస్తున్న ఎస్‌ఐ గోవిందు, నాయకులు


తలుపులలో అంబేడ్కర్ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


బుక్కపట్నంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం


ధర్మవరంలో నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు


తాడిమర్రిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు


నల్లమాడలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ధర్మవరం మండలం చిగిచెర్లలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం


ఓడీ చెరువులో అంబేడ్కర్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న దృశ్యం


ఎన్‌పీకుంట తహసీల్దార్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


కనగానపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాప్రతినిధులు, దళిత నాయకుల నివాళి


చెన్నేకొత్తపల్లిలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సీఐ, సొసైటీ సభ్యులు

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

పుట్టపర్తి టౌన్: బడుగుల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ అంబేడ్కర్ దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఎస్పీ రత్న పేర్కొన్నారు. సోమవారం పోలీస్ కార్యాలయం ఆవరణలోఅంబేడ్కర్ 134 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్పీ సిబ్బందితో కలసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ దేశంలో కులమతాలకు అతీతంగా రాజ్యాంగ ఫలాలు అందించాలనే మంచి ఆశయంతో రాజ్యాంగానికి కృషి చేశారన్నారు. అంటరానితనం, వివక్ష నిర్మూలించాలని అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. అంబేడ్కర్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, ఎస్‌బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, సైబర్‌సెల్ సీఐ తిమ్మారెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఐలు వలి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న, పోలీస్ సిబ్బంది

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం

పుట్టపర్తి టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దామని వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధక్షుడు రమణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని పుట్టపర్తి ఎంఈఓ కార్యాలయం ముందు ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నాగప్ప, రాంమోహన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రాజగోపాల్, శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, కిష్టప్ప, సురేష్, ఓబులేసు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజారవాణా అధికారి మధుసూదన్ ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాలర్పించారు. కార్యక్రమంలో డీఎం ఇనయతుల్లా, సిబ్బంది ఉషారాణి, పార్థసారధిరెడ్డి ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ నేతలు

రహదారిపైనే కూరగాయల వ్యర్థాలు


రోడ్డుపై వేసిన పనికిరాని కూరగాయలను తింటున్న పశువులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో పోస్టాఫీస్‌కు వెళ్లే రహదారి.. పక్కనే సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయానికి వెళ్లే మెట్లు.. ఇలా ముఖ్యమైన రహదారిపైనే మార్కెట్‌లోని వ్యర్థాలు, కుళ్లిన కూరగాయలను వేశారు. వీటి దుర్వాసనను భరించలేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఆవులు అక్కడే కూరగాయలను తింటున్నాయి. చెత్తను రహదారిపై వేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్ని ప్రమాద మృతులకు నివాళి

ధర్మవరం అర్బన్: అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గతంలో ముంబై ఓడరేవులో జరిగిన అగ్ని ప్రమాదంలో 64 మంది అగ్నిమాపక సిబ్బంది, వందల సంఖ్యలో ప్రజలు మరణించారు. వారందరికీ ధర్మవరంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో సిబ్బంది నివాళులర్పించారు. అగ్నిమాపక శాఖ అధికారి రాజు మాట్లాడుతూ ఓడరేవు అగ్నిప్రమాద మృతులను స్మరించుకుంటూ ప్రతి ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వారోత్సవాల పోస్టర్లను మున్సిపల్ బీఎస్‌ఆర్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్ చేతులమీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం

ధర్మవరం: కార్మికుల సమస్యలను సర్కారు పట్టించుకోవడం లేదని సీఐటీయూ నాయకులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మండిపడ్డారు. మీరైనా కార్మికుల సమస్యలు తీర్చాలని సోమవారం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి సీఐటీయూ నాయకులు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ నాయకులు జేవీ రమణ, ఆయూబ్‌ఖాన్, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బాబు, ముకుంద, లక్ష్మీఓబులేసు మాట్లాడుతూ భారతదేశంలోని అన్ని కులాలు, మతాలు, కార్మికుల హక్కులను కాపాడే విధంగా, రాబోయే కాలంలో అధికార పార్టీలు ఏ కులానికి, ఏ మతానికి, కార్మికులకు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు నష్టం వాటిల్లే చట్టాలు తీసుకురాకూడదని రాజ్యాంగాన్ని అంబేడ్కర్ పకడ్బందీగా రూపొందించారన్నారు. కానీ 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం కార్మికులకు సంబంధించిన 44 చట్టాలను 4 కార్మిక కోడ్‌లుగా కుదించేసిందన్నారు. కార్మిక చట్టాల కుదింపుతో కార్మికులు అనేక నష్టాలు, కష్టాలకు గురికావాల్సి వస్తోందని వాపోయారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ఇప్పుడు ఉన్న ఆప్కాస్ విధానాన్ని రద్దు చేస్తే పర్మినెంట్ చేయాలని, లేకపోతే కార్మికులను కలుపుకుని ఐక్య ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శ్రీరాములు, పుల్లన్న, ఆప్కాస్ కార్మిక సంఘం కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

చెత్త విషయంలో ఘర్షణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రామ్‌నగర్‌లో సోమవారం చెత్త ఊడ్చే విషయమై ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. చింతా ఉమామహేశ్వరిపై పక్కింట్లో ఉన్న లలితమ్మ, ఆమె కూతురు భావన దాడి చేసి గాయపరిచారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు తల్లీకూతురుపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి


సీఐ, ఎస్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

చెన్నేకొత్తపల్లి: పల్నాడు జిల్లా మాచర్ల మండలంలో వ్యక్తి హత్యకు సంబంధించి వారి కుటుంబ సభ్యుల కథనం మేరకు సాక్షి దినపత్రికలో కథనం ప్రచురించినందుకు పత్రిక సంపాదకుడు ధనంజయరెడ్డితో పాటు మరో ఆరుగురు జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమని పాత్రికేయులు మండిపడ్డారు. అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం రామగిరి సీఐ శ్రీధర్, చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఇలియాజ్, మురళీధర్, ప్రవీణ్‌కుమార్.రామకృష్ణ, మహానందరెడ్డి, నాగేంద్ర, నారాయణస్వామి, షమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులకు వేళాయె

- లోదుక్కులతో పంటకు మేలు
- భూమి మరింత సారవంతం
- చీడపీడలు నశించే అవకాశం
- ఖరీఫ్‌కు రైతులు సమాయత్తం


చిగిచెర్ల సమీపంలో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు


పొలానికి సేంద్రియ ఎరువును తోలుకుంటున్న రైతు

ధర్మవరం రూరల్: తొలకరి వర్షాలు కురుస్తుండటంతో రైతులు వేసవి దుక్కులకు సిద్ధమవుతున్నారు. పొలాలకు సేంద్రియ ఎరువులను తోలుతున్నారు. వచ్చే ఖరీఫ్ వ్యవసాయానికి సమాయత్తం అవుతున్నారు. వేసవి దుక్కులతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. వేసవి దుక్కులతో ఎండ భూమిలోపలి వరకు బాగా తగిలి చీడపీడలు నశించే అవకాశం ఉందంటున్నారు. దీంతో పంట పెట్టే సమయంలో క్రిమి కీటకాల బెడద తగ్గుతుంది. ఫలితంగా రసాయన ఎరువుల వినియోగాన్ని అరికట్టవచ్చు. ధర్మవరం నియోజకవర్గంలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 59,882 హెక్టార్లు. వేరుశనగ, కంది, అలసంద, పెసర, జొన్న తదితర పంటలు సాగు చేస్తారు. సకాలంలో వర్షాలు కురిస్తే అధిక విస్తీర్ణంలో పంటలు సాగయ్యే అవకాశం ఉంది.

ధర్మవరం నియోజకవర్గంలో సాగు వివరాలు

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
ధర్మవరం	18,700
తాడిమర్రి	12,000
ముదిగుబ్బ	17,182
బత్తలపల్లి	12,000

ఇలా చేయాలి...

- వర్షాకాలానికి ముందే భూమిని మూడు దుక్కులు దున్నాలి. ఇలా చేస్తే తొలకరి వర్షాలకు నేల మెత్తబడి భూమిలోకి నీళ్లు ఇంకుతాయి.
- దుక్కులు లోతుగా.. అడ్డంగా, వాలుగా దున్నుకుంటే వర్షపు నీరు భూమిలోకి సక్రమంగా ఇంకి తేమను నిల్వచేసే సామర్థ్యం పెరుగుతుంది.
- దుక్కి దున్ని భూమిని ఎండబెడితే కలుపు మొక్కలు నివారించవచ్చు.
- దుక్కులు చేసే ముందు భూమిలో పశువుల పేడ, కంపోస్టు ఎరువులు, చెరువు మట్టిని వేయాలి.
- వేసవిలో దుక్కి దున్నితే భూమి గుల్లగా మారుతుంది. దీంతో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా తేమలో జీవించే వానపాముల సంతతి వృద్ధి చెందుతుంది. ఇవి భూసార పరిరక్షణకు ఉపయోగపడతాయి.
- ప్రధానంగా ఎండా కాలంలో దుక్కులతో భూమి లక్షణాలు మారి, తొలకరి వర్షాలు పడినప్పుడు విత్తేందుకు అనుకూలంగా ఉంటుంది.
- వేసవి దుక్కుల వల్ల భూమి పొరల్లోని కీటకాల గుడ్లు, శిలీంధ్రాలు బయటపడి ఎండవేడిమికి చనిపోతాయి. భూమికి హాని కలిగించే పురుగులు బయటకు వస్తే వాటిని పక్షులు తినేస్తాయి. ఫలితంగా చీడపీడల సమస్య తగ్గుతుంది.
- పొలంలో చెత్తాచెదారం ఉంటే లోతుగా దున్నితే భూమిలో కలిసి కుళ్లిపోతుంది. ఫలితంగా సేంద్రియ ఎరువుగా మారి భూమికి బలాన్నిస్తాయి.

భూసారం పెరుగుతుంది



వేసవి దుక్కులు చేసుకుంటే భూమిలో ఉన్న చీడపురుగుల గుడ్లు బయటపడి కీటకాలు నశిస్తాయి. దీంతో పురుగు మందుల వాడకం తగ్గి వాతావరణ కాలుష్యం ఉండదు. వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు దున్నుకోవాలి. దీంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోతుంది. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటే పంటలలో అధిక దిగుబడులను సాధించే అవకాశం ఉంది. – ముస్తఫా, వ్యవసాయాధికారి, ధర్మవరం

విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం


వేలాడుతున్న విద్యుత్ తీగలు

నల్లచెరువు: మండల కేంద్రలోని బురుజు గంగమ్మ సర్కిల్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఇంటి గోడపై కరెంటు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. కూలీలు పనిచేసే సమయంలో ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందనా లేదని స్థానికులు చెబుతున్నారు.

క్లుప్తంగా

ప్రజా సమస్యలపై దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

తలుపుల : పంచాయతీల్లో ప్రజా సమస్యలపై దృష్టి సారించి త్వరిత గతిన పరిష్కరించాలని ఎంపీడీఓ రామానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ శ్రీలత అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎగువపేటలో డ్రెయినేజీ సమస్య తీర్చాలని, వీధి దీపాలు వెలిగేలా చూడాలని గ్రామసభ దృష్టికి వచ్చినట్లు సెక్రటరీ అనీల్ తెలిపారు.

శివాలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందిస్తున్న దాత మాగులూరు కృష్ణమోహన్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిరిడీసాయి బాబా ఆలయ ప్రాంగణంలో శివాలయం నిర్మాణానికి సోమవారం ఫర్టిలైజర్స్ నిర్వాహకుడు మాగులూరు కృష్ణమోహన్, సుప్రసన్న దంపతులు రూ.50 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా దాతలను శ్రీ షిరిడిసాయిబాబా సేవా సమితి సభ్యులు నారాయణ, సూర్యప్రకాష్ అభినందించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తనకల్లు: కొక్కంటిక్రాస్‌లో కాపునాడు కదిరి నియోజకవర్గ అధ్యక్షుడు కొండా మల్లికార్జున స్వగృహంలో సోమవారం రాయల్ కాపునాడు సంస్థ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు గంగుల వీరాంజనేయులు, యూత్ అధ్యక్షుడు కావలి కృష్ణతేజ, తంబళ్లపల్లి కాపునాడు అధ్యక్షుడు శశిభూషణ్, నాయకులు బాలాజీ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ నూతన కమిటీ


నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు జోనల్ సెక్రటరీ ఫయాజ్‌బాషా తెలిపారు. సోమవారం ధర్మవరంలో నిర్వహించిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడిగా గీత, ప్రధాన కార్యదర్శిగా నాగభూషణ, సహాయ కార్యదర్శిగా రమేష్‌రెడ్డి, కోశాధికారిగా నాగరాజు, మహిళా కార్యదర్శిగా సునిత, స్టేట్ కౌన్సిలర్‌గా సుమన్‌లాల్‌నాయక్ ఎన్నికయ్యారు. ఎన్నికైన వారందరికీ నియామక పత్రాలు అందించామని జోనల్ సెక్రటరీ తెలిపారు.

భూమనపై విమర్శలు తగదు

పుట్టపర్తి టౌన్: టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిపై కూటమి నాయకులు, టీటీడీ పాలక మండలి సభ్యులు విమర్శలు చేయడం తగదని వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర కార్యదర్శి తలమర్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భూమన టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు పలు సంస్కరణలతోపాటు ‘దళిత గోవిందం’, ఉచిత పెళ్లిళ్లు, ఎస్వీబీసీ చానల్ ప్రారంభించారని గుర్తు చేశారు. గోశాలలను అంకితభావంతో నిర్వహించలేక.. గోవుల సంరక్షణ చేయలేక.. వాటి మరణానికి కారణమవుతూ ఇప్పుడు భూమనపై విమర్శలు చేయడం సరికాదన్నారు. నిరాధార ఆరోపణలు చేయడం మాని, ఎన్నికల హామీలు నెరవేర్చడంపై పాలకులు దృష్టి సారించాలని హితవు పలికారు.

సోమందేపల్లిలో వర్షం


వెలిదడకలలో వర్షం కురుస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని వెలిదడకల, తుంగోడు కేతగాని చెరువు, గుడిపల్లి గ్రామాల్లో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా వర్షం కురువడంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. ఎండతో ఇబ్బంది పడుతున్న ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకున్నారు.